www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 12 ఆగస్టు 2023
5
వైఎస్ఆర్

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

విద్యార్థులతో వెంకట్రామిరెడ్డి

కడప అర్బన్: పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకట రామిరెడ్డి, ఇంటక్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాగరాజుపేటలోని మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో అంతర్గీనంగా ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసి వారిలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇంటక్ కో కన్వీనర్ పి.వి. సుబ్బారెడ్డి, కల్లూరు బాలఎల్లారెడ్డి, కొండారెడ్డి, గొబ్బూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు పి.శివప్రసాద్‌రెడ్డి

స్వయం సహాయక సంఘాల సభ్యులకు మెగా చెక్కను అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కడప

మహిళా సాధికారతే ధ్యేయంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక భరోసాను నింపేందుకే వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు పి.శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అమలాపురం బహిరంగ సభ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2022-23 సంవత్సరానికి సంబంధించి 4వ ఏడాది స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం లబ్ధి మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుండి రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి.శివ ప్రసాద్‌రెడ్డి, మిషన్ శక్తి స్టేట్ ఎక్జిక్యూటివ్ మెంబర్ మాలే సరస్వతి, మెప్మా పీడీ విశ్వ సురేష్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక ప్రగతి కోసం సున్నా వడ్డీ లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసి ప్రభుత్వం అండగా నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. ముఖ్యమంత్రి తన సుదీర్ఘ పాదయాత్రలో చేసిన హామీలన్నీ నెరవేరుతున్నాయన్నారు. మహిళ బాగుంటేనే ఇల్లు బాగుంటుందని తద్వారా గ్రామం, రాష్ట్రం, సమాజం బాగుంటుందని నమ్మి ముఖ్యమంత్రి ఆలోచన చేసి 90 శాతం పథకాలు మహిళల పేరిట అమలు చేస్తున్నారన్నారు. గ్రూపులో ఉన్న మహిళా సభ్యులు చిన్న చిన్న వ్యాపారం చేస్తూ పెద్ద, పెద్ద వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల్లోని పేదింటి అక్కచెల్లెమ్మల మీద ఏ మాత్రం వడ్డీ భారం పడకుండా, ప్రభుత్వమే వారి తరఫున వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద ఆ భారాన్ని భరిస్తున్నదన్నారు. ఎంత వడ్డీ అవుతుందో అంత మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధితో మహిళలు చిన్న, చిన్న వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం 2022-23 సంవత్సరానికి సంబంధించి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద జిల్లాలోని పట్టణ, గ్రామీణ పరిధిలో 37,576 (పట్టణంలో 11,849 గ్రామీణ 25727) సంఘాలలోని 399795 మంది సభ్యులకు రూ.57.48 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘ మహిళలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- సఫాయి కర్మచారీ జాతీయ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేషన్

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేషన్

ప్రజాశక్తి-కడప

పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, కుటుంబ భద్రత, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందని సఫాయి కర్మచారీ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేషన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లాలోని సఫాయి కర్మచారీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో వెంకటేషన్ మాట్లాడుతూ ఈ రోజు సమాజం ఆరోగ్యకరంగా, ఆహ్లాదకరంగా ఉందంటే పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితమేనన్నారు. పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలు ఆరోగ్య వంతంగా ఉంటేనే నగరాలు, పట్టణాలు, గ్రామాలు ఆరోగ్యవంతంగా ఉంటా యన్నారు. ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ, ఆవాస్ యోజన ద్వారా హౌసింగ్ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి నెలా రెండవ సోమవారం కార్మికుల సమస్యలను విన్నవించేందుకు ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించేలా అన్ని మున్సిపాలిటీల కమిషనర్లను ఆదేశించారు. మహిళా కార్మికుల సమస్యలను గుర్తించి, పరిష్కార చర్య లను చేపట్టాలని ఆదేశించారు. కార్మికులందరికీ ఇఎస్ఐ, ఇపిఎఫ్ ఖాతాలు నమోదు చేయించాలని, కార్మికుల కుటుంబాలన్నింటికి హెల్త్ కార్డులను అందించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు చెందిన పారిశుధ్య కార్మికులు హాజరై వృత్తి పరంగా, ఆర్థికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆ కమిషన్ చైర్మన్ వెంకటేషన్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జెసి గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, ఎఎస్‌పి తుషార్ డూడీ, శిక్షణ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్‌డిఒ ధర్మ చంద్రారెడ్డి, జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, డిపిఒ ప్రభాకర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, ఎస్‌సి, బిసి, మైనారిటీ కార్పొరేషన్ల ఇడిలు డాక్టర్ హెచ్.వెంకట సుబ్బయ్య, డాక్టర్ వి.బ్రహ్మయ్య, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి పాల్గొన్నారు.

కడప ఉక్కు కోసం రాష్ట్ర సదస్సు : డివైఎఫ్ఐ

సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర హక్కైన కడప ఉక్కుపై చేస్తున్న ద్రోహాన్ని ఎండగట్టడం కోసం కడప ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో కడప వేదికగా రాష్ట్ర స్థాయి సదస్సు ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కడప ఉక్కు సదస్సుకుకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు బి.నారాయణ, డివైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాపితంగా డివైఎఫ్ఐ యువజన సంఘం నాయకత్వం హాజరవుతున్నారన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఏ విధంగా పోరాడారో ఇప్పుడు కడప ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదం రాష్ట్ర వ్యాప్తంగా ఆనందించడమే సదస్సు ప్రాముఖ్యత అన్నారు.కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కును పూర్తిగా విస్మరించిందని దానికి పార్లమెంటులో చెప్పిన ప్రకటనే నిదర్శనమన్నారు. విభజన హక్కు కడప ఉక్కు అన్నారు. ఈ సదస్సు ను యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం. ఓబులేసు, ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

బిజెపికి వైసిపి, టిడిపి కీలుబొమ్మలు : పిసిసి

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి-చెన్నూరు

ఆంధ్రప్రదేశ్‌కు బిజెపి ఒక శని గ్రహంలా, వైసిపి, టిడిపిలు రాహు కేతువులుగా దాపురించాయని కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ రాజ్యసభ సభ్యులు, పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కమలాపురం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టిందన్నారు. జిల్లాలోని స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలకడంతో పాటు దుగరాజపట్నం ఓడరేవు ఊసే లేదన్నారు. రాయలసీమ ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తిలోదకాలు ఇచ్చిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రశ్నార్థకమైందని, విశాఖ రైల్వే జోన్ ప్రస్తావనే లేదని, ఆంధ్ర ఆత్మాభిమానికి ప్రతీకైన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకొని మన్మోహన్‌సింగ్ వరకు 13 మంది ప్రధానుల కాలంలో కేంద్ర ప్రభుత్వం రూ.46 లక్షల కోట్ల అప్పు చేయగా ఎనిమిదేళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం రూ.109 లక్షల కోట్ల అదనంగా అప్పు చేసిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని అమ్మకానికి పెట్టడంతో పాటు, ప్రభుత్వ రంగ సంస్థలను, విమానాశ్రయాలను, నౌకాశ్రయాలను, రైల్వే స్టేషన్లను అమ్మేస్తుందని దుయ్యబట్టారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోవడంతో పాటు పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ నిత్యవసర సరఫరా ధరలు సామాన్యునికి అందుబాటులో లేవన్నారు. సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో టిడిపి, వైసిపి, జనసేనలకు ఓటేస్తే అది బిజెపికి వేసినట్లేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లయితే రూ.ఆరు లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా, నిరుపేద కుటుంబానికి నెలకు రూ.ఆరు వేలు ఆర్థిక సహాయం, రాష్ట్రానికి సంజీవని ఎలాంటి ప్రత్యేక హోదా అమలు లాంటి కార్యక్రమాలు అమలు చేస్తారని పేర్కొన్నారు. కమలాపురం నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ విష్ణుప్రీతంరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా సంస్థాగతంగా బలోపేతం చేస్తామన్నారు. సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, వెంకటరెడ్డి, షేక్ గౌసియా, నాగరాజు రెడ్డి, చార్లెస్, సందన్ బాషా, ఓబులేసు పాల్గొన్నారు

జడ్‌పి సిఇఒకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్సీ రవి

వైసిపి అభ్యర్థి ఏకగ్రీవానికి కుయుక్తులు

- జడ్‌పి సిఇఒకు మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి వినతి

ప్రజాశక్తి-కడప అర్బన్

వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు జరిగితే ఓడిపోతామనే ఏకగ్రీవానికి వైసిపి నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి పేర్కొన్నారు. టిడిపి సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ తీసు కోకుండా ఇబ్బంది పెడుతున్న ఎంపిడిఒపై చర్యలు తీసు కోవాలని జడ్‌పి సిఇఒకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇడుపులపాయ సర్పంచ్ ఎన్నికలకు టిడిపి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి ఇంటి పన్ను కట్టలేదని, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఎంపిడిఒ మల్లికార్జున్‌రెడ్డి అడ్డుప డుతున్నారన్నారు. ఒక వారం ముందే సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పడం అడ్డంకులు కాదా అని ప్రశ్నించారు. జగన్ సొంత నియోజకవర్గం లో టిడిపి అభ్యర్థి నామినేషన్ కు స్క్రూటిలో ఏమైనా ఇబ్బందులు కలిగిస్తే జగన్మోహన్‌రెడ్డి భయపడినట్లే అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గెలిస్తే సొంత నియోజకవర్గంలో ఓడిపోయామని జగన్‌కు భయం పట్టుకుందన్నారు. ఎలాగైనా వైసిపి అభ్యర్థి ని ఏకగ్రీవం చేసుకోవాలని చూస్తున్నారని అన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని నారాయణ స్కూల్ ఎజిఎం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం హౌసింగ్ బోర్డు కాలనీలో వున్నా నారాయణ స్కూల్ విద్యార్థులకు క్లాస్ లీడర్ ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించారు. ఎజిఎం శ్రీనివాసులు, ప్రిన్సిపల్ గీతా ఆద్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లడుతూ ఎలక్షన్ పద్ధతిలో క్లాస్ లీడర్స్‌ను ఎన్నుకోవడం ఒక్క నారాయణ స్కూల్లలో మాత్రమే ఉందన్నారు. చిన్న పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంచడానికి ఇది ఉపయోగ పడుతుందన్నారు. పిల్లలకు పెరిగేకొద్దీ ఎలక్షన్ అంటే ఏంటో, ఏ విధంగా జరుగుతుందో ఒక మంచి అవగాహన వస్తుందని చెప్పారు. ఈరోజు పిల్లలే రేపటి నాయకులు అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, అకాడమిక్ డీన్ దీప్తి,స్కూల్ టీచర్లు, వైస్ ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ ఎమ్‌డిని కలిసిన జిల్లా నాయకులు

కడప అర్బన్: ఎస్సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చిన్నరాముడు జిల్లాకు చెందిన మాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు శివ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ కార్పొరేషన్ ఎమ్‌డిగా ఎస్.చిన్న రాముడు బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన నేపథ్యంలో తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో మాల ఐక్యవేదిక రాష్ట్ర సలహాదారు శివప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతురాజు కలిసి శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని దళిత రైతులను ఆదుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకుని నాణ్యమైన విత్తనాలు, మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇదే తరహాలో దళితులకు వ్యవసాయ భూములు కేటాయించాలని, గతంలో ఇచ్చిన భూములను రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. దళిత విద్యార్థుల సంక్షేమం కోసం పాలకులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఇదే నేపథ్యంలో ఉన్నత విద్యకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు పెంచినకాస్మోటిక్ ఛార్జీలు చెల్లించాలని, మెరుగైన వసతులు కల్పించాలన్నారు. చలికాలం రానున్న నేపథ్యంలో నాణ్యమైన దుప్పట్లు విద్యార్థులకు అందించాలని కోరారు. ఎమ్‌డిని కలిసిన వారిలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శివ నాయక్ ఉన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం : జడ్జి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎం.ప్రదీప్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌భవన్లో ర్యాగింగ్ యొక్క చెడు ప్రభావాలు, విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌ను నిషేధించడంతోపాటు విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపే శిక్షాస్పద నిబంధనలు మొదలగు అంశాలపై సెన్సిటైజేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఒక టీంను ఏర్పాటు చేశారన్నారు. ఈ టీంలో ఒక న్యాయమూర్తి, ఇద్దరు న్యాయవాదులు, ఒక సైక్రియాటిస్ట్, ఒక సోషల్ వర్కర్, ఒక రిటైర్డ్ విద్యాశాఖ అధికారి వుంటారని తెలిపారు. ఈ టీమ్ ప్రొఫెషనల్ కాలేజీ లో ఉన్న అధ్యాపకులకు ర్యాగింగ్ యొక్క చెడు ప్రభావాలు, విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను నిషేధించడంతోపాటు విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపే శిక్షాస్పద నిబంధనలు మొదలగు అంశాల పట్ల సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్స్ నిర్వహించి క్షుణ్ణంగా అవగాహన కల్పించడం జరుగుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో టీం సభ్యులు సీనియర్ న్యాయవాదులు చంద్రకాంతమ్మ, ప్రభాకర్, సైకియాట్రిస్ట్ డాక్టర్ శ్రీ వెంకట రాముడు, ప్రొఫెసర్, రిమ్స్ హాస్పిటల్, సోషల్ వర్కర్ దశరామిరెడ్డి, రిటైర్డ్ మండల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ వి.నాగముని రెడ్డి, వివిధ మెడికల్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

వైవీయూలో ఉర్దూ పోస్టులు మంజూరు చేయండి

కడప అర్బన్: యోగి వేమన విశ్వవిద్యాలయ ఉర్దూ విభాగానికి శాశ్వత ప్రాతపదికన ఏర్పాటు చేసి ఆచార్యుల పోస్టులు మంజూరుకు రాష్ట్ర ఉన్నత విద్య మండలికి ప్రతిపాదనలు పంపించండని రూట లెక్చరర్స్ వింగ్ వ్యవస్థాపకులు సయ్యద్ హిదాయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వసీవుల్లా బక్తియారి యోగి వేమన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ చింత సుధాకర్ కు వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం విసిని రూట నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా కేవలం అకాడమిక్ కన్సల్టెంట్‌లతో ఉర్దూ విభాగం కొనసాగిస్తూ, ఆచార్యుల పోస్టులు మంజూరు చేయకుండా, ఉర్దూ పీజీ విద్యార్థులకు పిహెచ్‌డి అవకాశం లేకుండా నామమాత్రంగా కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. స్పందించిన విసి జిల్లా లో ఉర్దూ విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉందని పేర్కొన్నారు. ఉర్దూ విభాగాభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూట ప్రధాన సలహా దారులు ప్రొఫెసర్ సత్తార్ సాహిర్, రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్ పాల్గొన్నారు.

విసికి వినతిపత్రం ఇస్తున్న రూటా నాయకులు

భవిత సెంటర్‌కు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

సాపలు అందజేస్తున్న ధ్రువచరిత

నగరంలోని ఎన్జీవో కాలనీలో ఉన్న భవిత సెంటర్లో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు కాలనీలో ఉన్న జి.ధ్రువ చరిత పుట్టినరోజు సందర్భంగా, సాపలు, పలకలు, బలపాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. భవిత సెంటర్ చిన్నారి కీర్తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు స్వీట్స్, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయమ్మ, సిద్ధారెడ్డి, ఆయ మల్లిక పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మహిళా సంక్షేమం సాధ్యం

కడప అర్బన్: నగరంలోని 27వ డివిజన్‌లో సున్నపురాళ మిట్ట గరీబ్ షా వీధులలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్.అమీర్ బాబు ఆదేశాల మేరకు మహిళలకు భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి అనే పథకాలతో మహిళా నాయకులు శుక్రవారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్ మాట్లాడుతూ రాబోయే రోజులలో తెలుగుదేశం పార్టీని మహిళలు ప్రజలు భ్రమరాథం పట్టి గెలిపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి అనిత, నగర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి వరద పార్వతి, కిరణ్ కుమార్ యాదవ్, నగర తెలుగు మహిళ ఉపాధ్యక్షులు ప్రణవతి, సాత్విక, నాగలక్ష్మి, ప్రమ్మిళమ్మ, స్వర?లత, రాణి, లతక్క, విజయ పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ

కడప: నులిపురుగుల ద్వారా వచ్చే వ్యాధుల నుంచి ప్రతి ఒక్కరు సంరక్షించుకోవాలని డాక్టర్ రియాజ్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ పురుషుల కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో శుక్రవారం నులిపురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ రక్తహీనత యొక్క అవసరతను గుర్తించి ప్రతి విద్యార్థి ఏడాదికి రెండుసార్లు నులిపురుగుల నివారణ మాత్రలను తీసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రమేష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు శివరామకృష్ణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ వై.సావిత్రి, మొదటి సంవత్సరం విద్యార్థిని విద్యార్థినిలు పాల్గొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు అందరికీ కూడా నులిపురుగుల నివారణ మాత్రలను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ చేతుల మీదుగా అందజేశారు.

మాట్లాడుతున్న డాక్టర్ రియాజ్

పేదలకు వరం సిఎం సహాయనిధి

కడప: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరంలాంటిదని, పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.13 లక్షలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. ప్రతి పేద వాడిని ఆదుకోవడానికి ఆరోగ్యశ్రీ పథకం వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదప్రజలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. కడప నగరం గౌస్ నగర్‌కు చెందిన షేక్ నజీర్ బాషా లీవర్ ట్రాన్స్ ప్లాంటేషన్ శాస్త్ర చికిత్స కొరకు వారి కుటుంబ సభ్యులకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.13 లక్షల చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్‌కుమార్, కార్పొరేటర్లు జహీర్, షేక్ మహమ్మద్ షఫీ, అజ్మతుల్లాహ్ ఖాన్, నాయకులు బంగారు నాగయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

కడప: కడపలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రెండో విడత డిగ్రీ అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను నాలుగేళ్ల డిగ్రీ కోసం ప్రవేశాల నిమిత్తం కళాశాలలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి విడతగా అడ్మిషన్లు పొందని విద్యార్థులు గ్రూపును మార్పునకు సంప్రదించాలన్నారు.

98 డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయాలి

చెన్నూరు: 1998 డిఎస్‌సిలో అర్హత సాధించిన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించి మిగిలిపోయిన 2200 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చి ప్రభుత్వం న్యాయం చేయాలని అభ్యర్థులు కోరారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంటిఎస్ పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చేందుకు 6782 మంది క్వాలిఫై అభ్యర్థులను వెరిఫికేషన్ చేసి కేవలం 4072 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారన్నారు. మిగిలిపోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆవేద వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు వివిధ రకాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేదన్నారు. మిగిలిపోయిన వారిలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, వికలాంగులు, ఒసి, మహిళలు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారికి ఉద్యోగాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో డిఎస్‌సి నాన్ జాయినింగ్ అభ్యర్థులు గురుప్రసాద్, శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్, శ్రీనివాసులు, ప్రసాద్, ఆవుల రమణయ్య పాల్గొన్నారు.

పంట నమోదు పక్రియ ప్రారంభం

పంట నమోదు చేస్తున్న అధికారులు

వల్లూరు: మండలంలోని బాలు గారిపల్లిలో రైతులు వేసిన పంట నమోదు ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైందని కమలాపురం సహాయ కంచాలకులు ఏవి నరసింహారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని దాని వల్ల రైతు భరోసా, కనీసం మద్దతు ధరకు, అమ్ముకునే అవకాశం, పంటల బీమా, సున్నా వడ్డీ పెట్టుబడి రాయితీ వంటి ప్రభుత్వ పథకాలు అన్నిటిని ఈ పంట నమోదు మూలమని వివరించారు. ఆర్‌బికె సిబ్బంది అంతా కూడా పంట నమోదు కోసం వెళ్లే ముందుగానే రైతులు ప్రతిరోజు ఏ సర్వే నంబర్స్ కు పంట నమోదు చేయడానికి వస్తామని రైతులకు ముందుగానే తెలియజేస్తారని చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుండి జియోకు ఆర్డినేటర్స్‌తో కూడిన పంట నమోదు యాప్ ఇవ్వడం జరిగిందన్నారు. కౌలుకు చేసుకుంటున్న రైతులు కూడా పంట నమోదు చేయించుకోవాలని తర్వాత ప్రభుత్వ పథకాలు అమలు వీలుగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని సాయి జ్యోతి మాట్లాడుతూ పంట నమోదుతో పాటు ఇకెవైసి కూడా ఇవ్వడం జరుగుతుందని కావున రైతు సోదరులు కూడా ఎందుకు సహకరించి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక, వ్యవసాయ సహాయకులు సురేఖ, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఒప్పందంలో అన్యాయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నిరసన తెలుపుతున్న ఆర్‌టిపిపి ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు మరియు క్రమబద్ధీకరణ విషయంలో ప్రభుత్వం అన్యాయం చేసిందంటూ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌టిపిపి వద్ద నిరసన చేపట్టారు. ఈ ఒప్పందంపై రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు, ఇంజినీర్స్‌ల నుండి తీవ్ర వ్యతిరేకత, నిరసన వ్యక్తం అవుతోందని తెలిపారు. భోజన విరామ సమయంలో ఆర్‌టిపిపి గేటు వద్ద కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు ఇవ్వాలని, కార్పొరేషన్ నుండి కాకుండా యాజమాన్యమే కార్మికులకు వేతనాలు ఇవ్వాలని కోరారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను తాను అధికారంలోకి వస్తే పర్మనెంట్ చేస్తానని పాదయాత్రలో ఇచ్చిన హామీని జగన్ మోహన్‌రెడ్డి నిలుపుకోవాలని కోరారు. కొత్త నిభంధనలతో సినియర్ ఉద్యోగులు తీవ్రంగా నష్ట పోతారన్నారు. వేతన ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు వెంకట్, గిరిబాబు, రంగనాథ్, నూరుబాష, చిన్నరెడ్డి, నరసింహులు కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు గంగయ్య, పుల్లారెడ్డి, నాగేంద్ర, రాము, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులా..!

- మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆగ్రహం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రశ్నించినందుకే తనపై కేసు పెడతారా, ఏ కేసు పెడతారో పెట్టండి చూద్దామని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్థానిక ఎమ్మెల్యే రాచ మల్లు శివప్రసాద్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ రామలక్ష్మి వద్ద నలభై లక్షలు డబ్బు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

తీసుకుని పోస్టింగ్ వేయించావా లేదా అని ఎమ్మెల్యే రాచమల్లును ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎమ్మెల్యేను కలవమని సబ్ రిజిస్ట్రార్ చెప్పడం సబబు కాదని చెప్పానని, అందుకే సబ్ రిజిస్ట్రార్‌తో తనపై పోలీసులకు ఫిర్యాదు ఇప్పించేందుకు ఎమ్మెల్యే రాచ మల్లు విశ్వ ప్రయత్నం చేశారన్నారు. లంచ గొండి అధికారులను ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందన్నారు. 2024 ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేసి ఎమ్మెల్యే రాచమల్లు అవినీతికి అంతం పలుకుతానని పేర్కొన్నారు. తనమీద మాట్లాడేటప్పుడుఎమ్మెల్యే రాచమల్లు జాగ్రత్తగా మాట్లాడాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అన్యాయంగా కేసు నమోదు చేశారన్నారు. చంద్ర బాబు ఎక్కడ కూడా ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించలేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ అమీర్, మాజీ టిడిపి పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధికార ప్రతినిధిగా సుభాన్‌బాషా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైసిపి జిల్లా అధికార ప్రతినిధిగా ఎర్రగుంట్లకు చెందిన షేక్ సుభాన్ బాషాను నియమించారు. ఆ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుండి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా సుభాన్ బాషా మాట్లాడుతూ పార్టీకి చేసిన కృషిని గుర్తించి అధినాయకులు తనను జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినందుకు హర్షం వ్యక్తం చేశారు. పదవి రావడానికి కారణమైన జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి, కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విధి విధానాలను, సంక్షేమ పథకాలను, ప్రతిపక్ష పార్టీ చేసే తప్పుడు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి గెలుపునకు తన వంతు పాటుపడతానని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ జెఇ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేంపల్లెలోని 33/11 కెవి వేంపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని గాజులపేట ఫీడర్‌లోని గాజులపేట, పుంగనూరు రైస్‌మిల్లు, 11 కెవి ఆర్టీసీ ఫీడర్స్ లైనుకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఎల్‌సి తీసుకున్నట్లు చెప్పారు. ఫీడర్ నియంత్రణలో ఉన్న కడప రోడ్డు, భరత్‌నగర్, రెడ్డయ్య కాలనీ, ఎస్సీ కాలనీ, బస్టాండ్, బూడిద గుంట, ప్రియా తోట, చైతన్య స్కూల్, ప్రభుత్వ బాలుర పాఠశాల, కాపు వీధి, గాండ్ల వీధి, పాతపేట, మార్కెట్, గరుగువీధి, మఠం వీధి, అమ్మవారిశాల వీధి, తహశీల్దార్ కార్యాలయం ప్రాంతాల్లో ఉదయం 7:45 నుండి 11:45 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. మండలంలోని గిడ్డంగివారిపల్లె ఎస్ఎస్‌లో ఉన్న 11కెవి ఫీడర్స్, తాళ్ళపల్లె రూరల్, గిడ్డంగివారిపల్లె రూరల్ ప్రాంతాల్లో కూడా విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నట్లు ఎఇ శివ తెలిపారు. ప్రజలు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

జమ్మలమడుగు : జమ్మలమడుగు పట్టణంలోని 33/11 కె.వి.సబ్ స్టేషన్‌లో సాధారణ మరమ్మతులలో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జమ్మలమడుగు అర్బన్ విద్యుత్ శాఖ ఎఇ రాజబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యాపారస్తులు, రైతులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ప్రొద్దుటూరు : విద్యుత్ పనుల నిర్వహణలో భాగంగా శనివారం నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఇఇ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెఇపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముద్దనూరు : విద్యుత్ సబ్‌స్టేషన్లు మరమ్మతులు కారణంగా జమ్మలమడుగు తాలుకాలోని అన్ని మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ డిఇ శేషగిరి బాబు, ముద్దనూరు ఎఇ శ్రీనివాసరాజ వర్మ తెలిపారు. శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంత రాయం ఉంటుందన్నారు. విద్యుత్ వియోగదారులు సహ కరించాలన్నారు.

కొండాపురం : విద్యుత్ శాఖలోని 33/11కెవి సబ్‌స్టేషన్‌లలో సాధారణ పరిపాలన మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొండాపురం, పొట్టిపాడు, బూరుగుపల్లి, టి.కోడూరు సబ్ స్టేషన్లలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆ శాఖాధికారి ఓబులేస్ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలన్నారు.

ఎపిఎస్‌టిఎఫ్ జిల్లా సిపిఎస్ కన్వీనర్‌గా నరేష్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఎపి ఎస్‌టిఎఫ్ జిల్లా సిపిఎస్ కన్వీనర్‌గా మైదుకూరు నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.విద్యాసాగర్ తెలిపారు. స్థానిక అనిబిసెంట్ పురపాలక ఉన్నతపాఠశాల ఆవరణలో శుక్రవారం యూనియన్ ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చిందన్నారు. అధికారంలోకొచ్చాక హామీలు నెరవేర్చకపోగ ఉద్యోగ, ఉపాధ్యాయులపై అక్రమ కేసులు బనాయించి, భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 60వేల మంది ఉపాధ్యాయులకు పోస్టుల అప్‌గ్రేడేషన్, బదిలీల ద్వారా వచ్చిన సమస్య కారణంగా దాదాపు మూడు నెలలు గడుస్తున్న జీతాలు చెల్లించకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. దీనిపై ప్రభుత్వం త్వరగా స్పందించి జీతాలు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాశనం చేసే జిఒనెం.117ను రద్దు చేయాలన్నారు. సిపిఎస్ కన్వీనర్‌గా ఎన్నికైన నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేసేవరకు జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంటా రామ్మోహన్, పట్టణ గౌరవాధ్యక్షుడు హరే రామకృష్ణ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రూరల్ పరిధిలోని ఆచార్ల కాలనీ బ్రహ్మంగారి గుడివద్ద టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల శాంతారాం హాస్పిటల్ పర్యవేక్షణలో శుక్రవారం ఉచిత మెగా క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో 240 మంది రాగా 15 మందికి కంటి ఆపరేషన్ కోసం సిఫార్సు చేశారు. 30 మందికి ఉచితంగా కళ్లద్దాలు ఇచ్చారు. మిగతా వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వైద్యులకు అభినందనలు తెలిపారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పరిసరాలను శుభ్రంగా ఉంచి దోమల వ్యాప్తిని అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అన్నారు. స్థానిక కడప రోడ్డులో శుక్రవారం దుకాణాలను తనిఖీ చేశారు. టైరులో ఉన్న నీటిని తొలగించారు. నీటి నిలువ వల్ల దోమలు వచ్చే అవకాశం ఉందని, వీటివల్ల మలేరియా, డెంగీ వంటి రోగాలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, వార్డు సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నా, కుందూ తీర ప్రాంతంలో వరినాట్లు ముమ్మరం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పెన్నా, కుందూ నది తీర గ్రామాల్లో ఫిల్టర్ల ద్వారా సాగు నీటి అవకాశం ఉన్న గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయ్యవారిపల్లె, తిమ్మాయపల్లె, రామదాసు పురం, రాజువారిపేట, తిప్పిరెడ్డిపల్లె, కుందూనది తీర ప్రాంతాలైన కుచ్చుపాప, రామసుబ్బమ్మ కొట్టాలు, సీతారామాపురం, చాపాడు పరిధిలో వరి పంటను రైతులు సాగు చేపట్టారు. జులై మెదటి వారం నుంచి వరినార్లు సాగు చేపట్టారు. ఆగస్టు మొదటి నుంచి వరినాట్లు వేశారు. ప్రస్తుతం అక్కడక్కడ వరినాట్లు సాగు చేపడుతున్నారు. 3వేల ఎకరాల వరకు వరి పంట సాగైంది. కొంత మంది రైతులు మెదటిదఫా సత్తువలు కూడా చల్లుతున్నారు. కెసి కాలువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉండడంతో రైతులు ప్రస్తుతం విత్తనాలు, ఎరువుల సేకరణలో నిమగ్నమయ్యారు. కెసి కాలువకు త్వరగా నీరు విడుదలైతే 13వేల ఎకరాల్లో వరి పంట సాగయ్యే అవకాశం ఉంది. గతేడాది మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 16వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. సాగు నీరు విడుదల ఆలస్యంతో ఈ ఏడాది సాగు కూడా జాప్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. వరి సాగుకు ఆసక్తి కనబరచని రైతులు మినుము, మెక్కజొన్న సాగుకు సిద్ధమవుతున్నారు. వెదురూరు, నరహరిపురం, రాజుపాలెం, తిప్పిరెడ్డిపల్లె, సిద్దారెడ్డిపల్లె గ్రామ రైతులు మినుము విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయాలని కోరుతున్నారు.

సీతారామపురం వద్ద సాగైన వరి పంట

రేపు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు, బాలసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞానవేదిక ప్రొద్దుటూరు కమిటీ ఆధ్వర్యంలో ఆదివానం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను శివాలయం పక్కన ఉన్న నందిని క్లాత్ మార్కెట్‌లో ఉన్న జెవివి కార్యాలయంలో ఏర్పాటు చేశామని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల సుబ్బారెడ్డి, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పోలంకి శ్రీరాములు పేర్కొన్నారు. ఆ మేరకు పోస్టర్లను స్థానిక దీప్తీ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6,7 తరగతి విద్యార్థులకు స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాలు, స్వాతంత్ర్య సమర ఘట్టాల చిత్రాలు అనే అంశంపై డ్రాయింగ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 8,9,10 తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను భారతదేశం-భిన్నత్వంలో ఏకత్వం అనే అంశంపై నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ పోటీలో పాల్గొనడం ద్వారా పిల్లలు స్వాతంత్ర్యం రావడానికి మన నాయకులు ఏవిధంగా పాటుపడ్డారో తెలుసుకుంటారని, భారతదేశం గొప్పదనం, భిన్నత్వంలో ఏకత్వం అనేది ఏవిధంగానో తెలుసుకుంటారన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు చెప్పడం కంటే వాటిపై పోటీలను పెట్టడం ద్వారా వారే ఇలాంటి విషయాల పట్ల ఆసక్తి కనపరిచి శోధించి తెలుసుకుంటారని వివరించారు. పేర్ల రిజిస్ట్రేషన్ కోసం 97054 32038 ఫోన్ నెంబరును సంప్రదించగలరని సూచించారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జెవివి గౌరవ సలహాదారులు డాక్టర్ మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, పూర్వ అధ్యక్షులు ఉమ్మడిశెట్టి ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పక్కాగా చేపట్టాలి : జెసి

పజాశక్తి - వేంపల్లె

రైతుల భూములకు ఎలాంటి నష్టం జరగకుండా భూ రీ సర్వేను పక్కగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని నాగూరు గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వేకు శుక్రవారం సంబంధిత ఆ గ్రామ రైతులతో జాయింట్ కలెక్టర్ కలిసి సమస్యలను ఆడిగి తెలుసుకొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత భూ హక్కు పథకాన్ని అమలు చేస్తోందని జెసి తెలిపారు. ప్రతి రోజు 50 ఎకరాలకు రీ సర్వే చేపట్టాలని రెవెన్యూ, సర్వేయర్లను ఆదేశించారు. భూ సర్వేలో నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతులు చూపిన హద్దులకు రోవర్ మిషన్ సాయంతో సర్వే చేయాలని సూచించారు. నాగూరు గ్రామంలో ఇప్పటికీ వరకు దాదాపు 600 ఎకరాలకు భూ సర్వే చేపట్టినట్లు సర్వేయర్లు జెసికి వివరించారు. అంతకుముందు వేంపల్లెలోని రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఓ వెంకటేష్, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్వే ఎడి మురళికృష్ణ, మండల సర్వేయార్ శివారెడ్డి, సర్వేయర్లు రేణుక, దేవనాథ్‌రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు హేమలత, నాగరాజు, ఆర్‌డిడి అలివేలు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాగూరులో రైతులతో మాట్లాడుతున్న జెసి గణేష్‌కుమార్

ప్రతి ఇంటికెళ్లి ఓటరు వివరాలు పరిశీలించాలి

మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి నరసింహులు

ప్రజాశక్తి - చాపాడు

బిఎల్ఒలు ప్రతి ఇంటికెళ్లి ఓటరు వివరాలను పరిశీలించాలని ఎన్నికల ఎలక్టోరల్ అధికారి నరసింహులు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో శుక్రవారం బిఎల్ఒలు, సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్‌స్టేషన్ల పరిధిలో జనవరి 1 నుండి ఏప్రిల్ ఒకటి వరకు, జూలై 1 నుండి అక్టోబర్ 1 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ, ఓట్ల నమోదు, తొలగింపులో బిఎల్ఓ, బిఎల్ఎలు మాత్రమే పాలుపంచుకుంటారని వివరించారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఇందులో వాలంటీర్లు జోక్యం చేసుకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఓటర్ కార్డు ముద్రణలో తప్పులు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభానీ, మైదుకూరు తహశీల్దార్ అనురాధ, విఆర్ఓలు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

ప్రతిపక్షం జీర్ణించుకోలేకపోతోంది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - దువ్వూరు

జగనన్న పేదలకు సాయం చేస్తుంటే ప్రతిపక్షం జీర్ణించుకోలేక పోతోందని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి తెలి పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్య క్రమంలో భాగంగా శుక్రవారం ఆయన జొన్నవరం గ్రామ సచివాలయం పరిధిలోని నేలటూరు గ్రామంలో పర్యటించారు. నేలటూరు గ్రామంలో గత 36 నెలల్లో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి జరిగిన లబ్ధిని తెలియజేస్తూ ఆ పత్రాలను అందజేశారు. గత ప్రభుత్వాల పాలన.. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత పరిపాలన ఎలా ఉంది అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖసలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, తహశీల్దార్ రమాకుమారి, ఎంపిడిఒ జగదీశ్వర్ రెడ్డి, ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, జడ్‌పిటిసి కృష్ణయ్య, బొంతపల్లి వెంకటసుబ్బారెడ్డి అధికారులు పాల్గొన్నారు.

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

పారదర్శకంగా ఇ-క్రాప్ నమోదు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటల ఇ క్రాప్ నమోదు పారదర్శకంగా చేయాలని ముద్దనూరు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని సచివాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదులో అక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఎరువుల నిలువలు ఉండేలా చూడాలన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అరవిందనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రత్యామ్నాయ పంటలైన ధనియాలు,, కొర్ర, జొన్నలు సబ్సిడీతో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి శివమోహన్‌రెడ్డి, హార్టికల్చర్ బోర్డు సభ్యుడు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎడిఎ వెంకటసుబ్బయ్య

డబ్బా కొట్టుకుంటున్న వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గతంలో ఉన్న సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి తానేదో కొత్తగా ప్రవేశపెడుతున్నట్లు ప్రచారం చేసుకుంటూ వైసిపి ప్రభుత్వం డబ్బా కొట్టుకుంటోందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్ ద్వారా సంఘాల సున్నా వడ్డీ పథకంపై ప్రచారం చేసుకోవడం హాస్యా స్పదమన్నారు. 2012లోనే ఈ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ అమలు చేసిం దన్నారు. రూ.5లక్షల వరకు సున్నావడ్డీ మాఫీ చేసిందన్నారు. దీన్ని జగన్ ప్రభుత్వం రూ.3లక్షల వరకు అమలు చేస్తోందని తెలిపారు. జగన్ ప్రభు త్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ పథకాన్ని రూ.7లక్షల వరకు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వానికి ప్రచార యావ ఎక్కువైం దన్నారు. ఇంటింటికి స్టిక్కర్ అంటించడం ఏమిటని ఆయన ప్రశ్నిం చారు. పలు పత్రాలపై జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో చూస్తుంటే ఈ ప్రభుత్వం ప్రచా రాలకు, ఆర్భాటాలకు ప్రజా సొమ్మును దుర్వినియోగం చేస్తోందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎన్నికలకు వెళ్లాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నజీర్

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆగస్టీన్ రాజు స్టడీ మెటీరియల్‌ను వితరణ చేశారని ఆ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు తెలిపారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా దాత డాక్టర్ ఆగస్టీన్‌రాజు మాట్లాడుతూ పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు తగ్గట్టు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన సతీమణి డాక్టర్ ప్రత్యూష ప్రసంగించారు. ప్రిన్సిపల్ హనుమంతరావు మాట్లాడుతూ మొదటి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న దాదాపు 200 మంది విద్యార్థులున్నారని తెలిపారు. కళాశాల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రిన్సిపల్, డాక్టర్

సున్నా వడ్డీ నిధుల జమ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

వైయస్సార్ సున్న వడ్డీ పథకం కింద అర్హతగల పొదుపు ఖాతాలకు నిధులు జమ చేసినట్లు డిఆర్‌డిఎ ఏపీఎం మంజునాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 625 పొదుపు సంఘాలకు సంబంధించి రూ.87.51 లక్షల నిధులు జమ అయిందన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలని ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుడమలదిన్నె, సుంకేసుల గ్రామాల్లో శుక్రవారం సైబర్ క్రైమ్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. శాంతియుతంగా జీవించాలని, ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా స్వేచ్ఛాయుతంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు జరగవని వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ప్రజలకు సూచించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజరాజేశ్వర రెడ్డి

చిత్తశుద్ధితో నామినేషన్ వేయకుండా ఆరోపణలా..!

- జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ సర్పంచు ఎన్నికకు సంబంధించి టిడిపి చిత్తశుద్ధితో నామినేషన్ వేయకుండా అధికారులు, వైసిపి నాయకులపై టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపణలు చేయడం సిగ్గుచేటని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, కృష్ణతేజాతో కలిసి జడ్‌పిటిసి విలేకరులతో మాట్లాడుతూ అధికారులపై ఆరోపణలు చేసేటప్పుడు నిజాలు తెలుసుకోవాలన్నారు. వైసిపిపై నిందలు వేయడానికి నామినేషన్ పత్రాలు తప్పుల తడకగా పూర్తి చేసి పెద్దింటి లక్ష్మణతో నామినేషన్ వేయించారని ఆరోపించారు. నామినేషన్ల పరిశీలనలో సర్పంచుకు పోటీ చేసే అభ్యర్థితోపాటు ఒక్క టిడిపి నాయకుడు కూడా కార్యాలయం వద్దకు రాలేదన్నారు. నామినేషన్‌లో సరైన సమాచారం లేకనే ఎన్నికల రిటర్నింగ్ అధికారి టిడిపి నామినేషన్‌ను తిరస్కరించారన్నారు. ఇడుపులపాయలో ఎన్నికలు దిగ్విజయంగా జరిపించేందుకు అ గ్రామ పెద్దలే కంకణం కట్టుకొని ఉన్నారని చెప్పారు. తాము కూడా ఎన్నికలు జరగాలనే కోరుకుంటున్నామన్నారు. విలేకరుల సమావేశంలో హజ్ హౌస్ డైరెక్టర్ మునీర్, ఇడుపులపాయ ఇన్‌ఛార్జి సర్పంచు చలపతి, సర్పంచు అభ్యర్థి నాగమ్మ, పుల్లయ్య, గోపి, శ్రావణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం

వేలాడిన విద్యుత్ తీగలు - తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక మసీదు సమీపంలోని వీధిలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం ఒరిగి, విద్యుత్ తీగలు కిందకి వేలాడాయి. వర్షం కురుస్తున్న సమయంలో దారిలో ఎవరు తిరగక పోవడంతో పెను ప్రమా దం తప్పింది. ఒక స్తంభం ఒరగడంతో తీగల ధాటికి మరికొన్ని స్తంభాలు ఒరిగి తీగలు కిందకి వేలా డాయి. విద్యుత్ స్తంభాలు 2009 లో ఏర్పాటు చేసినవి కావ డంతో శిథిలావస్థలో ఉన్నాయని స్థానికులు అంటున్నారు. స్తంభాలు శిథి లావస్థకు చేరడం వల్ల ఈదురు గాలుల ధాటికి స్తంభాలు కూలుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మరోసారి ఇలాంటి సంఘటన జరిగి ప్రాణ, ఆస్తి నష్టం జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. శుక్రవారం ఉదయం ఎఇ శ్రీనివాసరాజ వర్మ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేసి మరమ్మతులు చేసి, విద్యుత్ సరఫరా చేశారు.

విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేస్తున్న విద్యుత్ అధికారులు

నేడు శాంతిరథం ప్రారంభోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మానవతా శాఖ ఆధ్వర్యంలో శనివారం మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో శాంతిరథం ప్రారంభోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మానవతా కార్యకర్త చెన్నకేశవులు తెలిపారు. శాంతి రథాన్ని మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్, ర్యాలీని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఓటర్ల పరిశీలన కార్యక్రమాన్ని టిడిపి నాయకులు కందుల ఓబుల్ రెడ్డి, కడప పార్లమెంటు బిసి సెల్ ఉపాధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో జరిగింది. శుక్రవారం మండల పరిధిలోని గురజాలలో బిఎల్ఓ ప్రసన్నతో కలిసి ఓటర్ల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు నమోదు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో టిడిపి నాయకులు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 8 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చినట్లు ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ సంధ్యారాణి తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో శుక్రవారం మ్యాపిల్ ల్యాబ్ అనే సంస్థ రాత పరీక్షలు నిర్వహించగా, సిఎస్‌సి విభాగంలో నాల్గవ సంవత్సరం చదివే 8 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు జరిపిటి చందు, అనిల్‌కుమార్, ఆంజనేయులు, జగన్ మోహన్‌రెడ్డి, చాకలి అనిల్, మోహన్‌రాజు, రవిచంద్ర, మౌనిక ఎంపికయ్యారని తెలిపారు. వీరికి ఏడాదికి రూ.5.5 లక్షలు వేతనం ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులను డైరెక్టర్ సంధ్యారాణి అభినందించారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

ఘనంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవం

దువ్వూరు : గుడిపాడు, చిన్నసింగనపల్లె గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నా భూమి-నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ ఓబులేష్ నందన్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగరవేయాలన్నారు. ఈ సందర్భంగా మిలటరీలో పనిచేస్తున్న ఉద్యోగి ఇరగంరెడ్డి కొండారెడ్డిని ఘనంగా సన్మానించారు. సీనియర్ సిటిజెన్ సంఘన లక్ష్మిరెడ్డి, నారుపల్లె సుబ్బారెడ్డిని, మరికొందరిని సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమాకుమారి, ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి ఏపీవో రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** మండల పరిధిలోని పుల్లూరు సచివాలయంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా శుక్రవారం నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శ్రీనివాసులు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **SHAIK AFSAR AHAMED** (Old Name), S/o **SHAIK YAQOOB ALI** Residing at 2/500, Nagarajupeta, Kadapa, Y.S.R.Dist-516001, A.P., India, do hereby Change My Name to **SHAIK APSAR AHAMED (NEW NAME).** Hence forth then new I may be called as SHAIK **APSAR AHAMED (NEW NAME).**